క్లుప్తంగా

ఆధ్యాత్మిక ప్రవచనం, హరికథా కాలక్షేపం



భక్తి గీతాలు ఆలపిస్తున్న బీకే బిందు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో 93వ వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు, నిత్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం శ్రీయజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి శ్రీ కృష్ణ చరణానంద భారతి స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి నగరానికి చెందిన బీకే బిందు, బీకే సింధు భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా పలు త్యాగరాజ, అన్నమాచార్య కీర్తనలు ఆలపించి వీనులవిందు చేశారు.

ఓటు వజ్రాయుధం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజల కోసం పని చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి ఓటు వజ్రాయుధమని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు నమోదు అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) అనే కార్యక్రమం అమలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక దొండపాడు శ్రీ బాల అయ్యప్ప స్వామి క్షేత్రానికి దక్షిణ వైపు ఖాళీ స్థలంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేయనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంత తవ్వకాల్లో చిరుదరహాసంతో ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి విగ్రహం లభ్యమైందని వివరించారు. ఉదయం 10.54 గంటలకు వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆస్థాన పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రత్యేక పూజలు, క్రతువులు అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

చిల్డ్రన్స్ హోమ్‌కు ఆర్థిక సాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రవితేజ చిల్డ్రన్స్ హోమ్ అభివృద్ధికి రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్‌ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యురాలు డి.బ్రహ్మేశ్వరి, కేఎస్ ఫణికుమార్ దంపతులు రూ.12 వేలు ఆర్థిక సాయాన్ని రవితేజ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ రిలీఫ్ సెంటర్ నిర్వాహకుడు ఎ.రాజుకు శుక్రవారం అందజేశారు. డాక్టర్ అట్లూరి ఉత్తమ దుర్గ విద్యార్థులకు తిను బండారాలను అందించారు.

వాహనాల వేగంతో భయం భయం

- శనివారపుపేట రోడ్డులో ప్రజలకు ఇబ్బందులు
- కానరాని స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్లు



శనివారపుపేటలో రోడ్డు దాటుతున్న పాదచారులు, చోదకులు



స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వేగంగా వెలుతున్న వాహనాలు

ఏలూరు రూరల్ : శనివారపుపేట రోడ్డుపై వాహనాలు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల సెంటర్ నుంచి శనివారపుపేట గాలి గోపురం వరకు విశాలమైన వన్‌వే రోడ్డు కారణంగా బైకులు, కారులు, భారీ వాహనాలు మితిమీరిన వేగంతో పయనిస్తున్నాయి. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు వాహనాలు రద్దీ ఉంటుంది. పెద్ద సంఖ్యలో స్కూటర్లు, బైకులు రెండు వైపులా 50 నుంచి 90 కిలో మీటర్ల స్పీడ్‌తో పయనిస్తున్నాయి. రోడ్డు అభివృద్ధి సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు సెయింట్ ఆన్స్ కళాశాల, శ్రీరామ్‌నగర్ 1, 6, 8, 12 రోడ్లతో పాటు తివాచీసెంటర్ వద్ద క్రాసింగ్ పాయింట్లు ఇచ్చారు. సరిగ్గా ఈ పాయింట్ల వద్ద స్కూల్, పెట్రోల్ బంక్, ఎస్‌బీఐ బ్యాంక్‌తో పాటు ప్రజలు నిత్యావసర సరుకులు కొనే దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ రోడ్డు దాటే సమయంలో కొన్నిసార్లు వేగంతో వస్తున్న వాహనాలు తప్పించేందుకు వృద్ధులు, పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో స్పీడు బ్రేకర్లు, పోలీస్ బీట్ ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఊడిపోయిన స్పీడ్ బ్రేకర్లు

రోడ్డు క్రాసింగ్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయి. గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు సెయింట్ ఆన్స్ కళాశాల, శ్రీరామ్‌నగర్ 1వ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన రబ్బర్ స్పీడ్ బ్రేకర్లు ఊడిపోయాయి. పాదచారులు నడిచే ప్రాంతాల్లో నలుపు, తెలుపు జీబ్రా చారలు సైతం కనిపించడం లేదు.

తరచూ ప్రమాదాలు



వాహనాలు వేగంతో రోడ్డు దాటేందుకు పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది నెలల క్రితం శ్రీరామ్‌నగర్ 6వ రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. గాయపడిన వ్యక్తి కోమాలోకి వెళ్లిపోయాడు. రోజుకు ఇద్దరు లేక ముగ్గురు పాదచారులు ప్రమాదాల నుంచి తృటిలో తప్పించుకుంటున్నారు. వేగాన్ని నియంత్రించాలి.

– ప్రసాద్, స్థానికుడు

చర్యలు తీసుకోవాలి



వాహనాల స్పీడ్ నియంత్రించేలా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ పోలీసులు ఈ రోడ్డుపై దృష్టి పెట్టాలి. ఉదయం, సాయంత్ర వేళల్లో కానిస్టేబుల్ నియమించాలి. రోడ్డు రెండు పక్కల రద్దీ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా చారలు ఏర్పాటుచేయాలి. అప్పుడు వాహనాల స్పీడ్‌కు అడ్డకట్ట పడుతుంది.

– సుభాని, స్థానికుడు

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం వార్షిక సమావేశం శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంఘం అధ్యక్షుడు కందుల వీరభద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. 75 వసంతాలు పూర్తి చేసుకున్న సభ్యులకు ఆత్మీయ సత్కారం చేశారు. వై.నరసింహరావు, వై.వేళాంగిణి, ఎన్ ప్రజారాజ్యం, ఎస్‌వీవీ సూర్యనారాయణ, ఎంఏ రజాక్, ఎస్ శకుంతలమ్మ, వెలగా వీరయ్య, ఎ.ఆశీర్వాదం, 15 మందికి సభ్యులకు శాలువాలు కప్పి, పూల దండలువేసి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి తానేటి భాస్కర్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎస్‌వీ రామారావు, కోశాధికారి కొఠారు మల్లికార్జున రావు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రేమికుల దినాన్ని నిషేధించాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారతీయ సంస్కృతిని మంట గలిపే ప్రేమికుల దినాన్ని బహిష్కరించాలని హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామనపూడి శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం పేరిట నిర్వహించే వికృత కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక వసంతమహల్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14న భారత దేశానికి ఒక బ్లాక్ డే అని పుల్వామాలో పాకిస్థానీలు 43 మంది భారత సైనికులను పొట్టనపెట్టుకున్న రోజున భారతీయులు మరచిపోకూడదని అన్నారు. సైనికులు త్యాగం చేసిన రోజున ఎటువంటి వేడుకలు చేసుకోకూడదన్నారు. వ్యాపార దృక్పథంతో నిర్వహించే ప్రేమికుల రోజును ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. ప్రేమికుల రోజు పేరుతో పార్కులు, రెస్టారెంట్లు, ఐస్‌క్రీం పార్లల్‌లో కనిపిస్తే హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేస్తామని తెలుపుతూ పసుపుతాళ్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు అవపా సురేష్, భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు పరసా కిషోర్, కేఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, అల్లం వీర రాఘవులు, ఎం శ్రీనివాసు, చెన్నా వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన కల్పించాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ బీమా సంస్థల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వాహన బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం బీమా కంపెనీల ప్రతినిధులకు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏలూరులోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో మోటారు వాహనాల ఇన్సూరెన్స్ కంపెనీల ఉద్యోగులు, సర్వేయర్లతో ఆయన వర్క్‌షాప్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలు ఆర్థికంగా రోడ్డున పడకుండా మోటారు వాహనాల బీమా ప్రయోజనాలు అందించాలని కోరారు. వివిధ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధుల సందేహాలను కరీం నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లాలోని ఇన్సూరెన్స్ కంపెనీ ఉద్యోగులు, సర్వేయర్లు, ఆర్టీఓ కృష్ణారావు, మోటార్ వాహనాల తనిఖీ అధికారులు బి.భీమారావు, బి.శేఖర్ పాల్గొన్నారు.

సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకం



సంజీవయ్య చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి



సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న ఏఐఏవైఎస్ నాయకులు

ఏలూరు(మెట్రో): నిజాయితీకి, నిరాడంబరత్వానికి, విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయులని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి జేసీ ధాత్రిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన సంజీవయ్య చేసిన సేవలను కొనియాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని నిరోధక శాఖను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జేడీ వి.జయ ప్రకాష్, సెట్‌వెల్ సీఈఓ ప్రభాకరరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆర్‌వీ నాగరాణి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్ఎస్ కృపావరం, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సంజీవయ్య

ఏలూరు (టూటౌన్): నిజాయితీకి, నిరాడంబరత్వానికి, విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయుడని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రప్రథమ దళిత ముఖ్యమంత్రి సంజీవయ్య జాతికి చేసిన సేవలను కొనియాడారు. తొలిసారిగా వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛన్ల పథకం ప్రవేశ పెట్టారని గుర్తుచేశారు. 1960లో పేదలకు ఆరు లక్షల ఎకరాల ఇళ్ల పట్టాల పంపిణీ, బీసీ రిజర్వేషన్లు 24 శాతం నుంచి 38 శాతానికి పెంచి కాపులకు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. అక్షురాస్యత పెంచడానికి నిర్బంధ ప్రాథమిక విద్య, ఉన్నత చదువుల్లో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మధ్యాహ్న భోజన పథకం ప్రవేశ పెట్టారని వివరించారు. కార్మికులకు బోనస్ చట్టం, కాంట్రాక్ట్ ఉద్యోగులకు కాంట్రాక్ట్ లేబర్ చట్టం తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.రమేష్, నూకపెయ్యి కార్తీక్, పులవర్తి డేవిడ్, ఎం కోటి, కనికెళ్ల మురళీ కృష్ణ, కె.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మధ్యాహ్నం కళాశాల పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన సంజీవయ్య నీతి, నిజాయితీలతో పరిపాలనలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పారని వివరించారు.

కార్మికుల జీవితాల్లో కారు చీకట్లు

- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న కూటమి ప్రభుత్వం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయని చంద్రబాబు
- ప్రభుత్వంపై కార్మికులు కార్మిక సంఘాల ఆగ్రహం



నిర్మాణ పనులు చేస్తున్న నిర్మాణ కార్మికులు (ఫైల్)

పెదపాడు: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం. కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీలిచ్చారు. కార్మికులు సహజ మరణానికి రూ.60 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు చెల్లిస్తామన్నారు. అదనంగా మట్టి ఖర్చులు మరో రూ.30వేలు ఇవికాక మహిళా కార్మికుల తొలి కాన్పునకు రూ.30 వేలు, రెండో కాన్పునకు రూ.30వేలు చెల్లిస్తామన్నారు. ప్రమాదవశాత్తు అంగవైకల్యం ఏర్పడితే రూ.5 లక్షలు అందిస్తామన్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధ కార్మికులకు పెన్షన్ రూపంలో సంక్షేమ బోర్డు ద్వారా సాయం అందిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. మాయ మాటలతో అమలు సాధ్యం కాని హామీలతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక ఆ హామీలన్నింటినీ చంద్రబాబు విస్మరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలేవీ అమలు చేయడం లేదు. ఫలితంగా దెందులూరు నియోజకవర్గంలోని భవన నిర్మాణ రంగ కార్మికుల జీవితాల్లో కారు చీకట్లు అలముకున్నాయి. వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక కొరతకు తోడు నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగిపోవడంతో ఆ ప్రభావం భవన నిర్మాణ రంగంపై పడింది. ఫలితంగా పనులు దొరక్క కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోక వేలాది మంది కష్టజీవులు రోడ్డున పడ్డారు.

ప్రమాదం జరిగితే దుర్భర జీవనమే

కార్మికుడు పనిచేసే చోట ప్రమాదం జరిగితే ఆదుకునే నాథుడే కరువయ్యాడు. కాంట్రాక్టరు, భవన యజమాని ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా ఎవరూ కల్పించడం లేదు. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికులు ఆర్థికంగా మానసికంగా ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి పాలైనా, మంచానికే పరిమితమైనా అప్పులు పాలైనా మళ్లీ వారు తేరుకోలేకపోతున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కులా ఉండే కార్మికుడు మంచాన పడితే వారి బతుకు బండి ముందుకు సాగడం లేదు.

సంక్షేమ బోర్డుతోనే భరోసా

గతంలో మాదిరిగా భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే కార్మికుల సాయమందేదనే అభిప్రాయం యూనియన్ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. కార్మికుడు ప్రమాదవశాత్తు గాయపడినా, అనారోగ్యంతో మంచానికే పరిమితమైనా సంక్షేమ బోర్డు ద్వారా ఎంతో కొంత ఆర్థికంగా సాయమందేది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది తప్ప ఆ దిశగా నేటికీ ఒక్క అడుగూ ముందుకు వేయడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలల కావస్తున్నా ఇప్పటి వరకు సంక్షేమ బోర్డు ఊసే లేదని కార్మికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు పదివేల మందికి పైగా కార్మికులు ఉన్నారు. వారంతా ప్రభుత్వం తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

ఇసుక కొరతతో పనుల్లేక కార్మికులు ఇంతవరకు బాధలు పడ్డారు. ఇప్పుడిప్పుడే ఇసుక దొరుకుతుందనుకుంటే భవన నిర్మాణ రంగ సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. ధరలు అందుబాటులో ఉంటే ఎవరైనా నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వస్తారు. నిర్మాణాలు జోరందుకుంటాయి. నిర్మాణ రంగ పనివారికి పనులు దొరుకుతాయి. ఆ ధరలు తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. గతంలో భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఎత్తేసారు. గత ఎన్నికల్లో కూటమి నాయకులు బోర్డు పునర్ధరిస్తామని హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. తక్షణమే పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్ పరిష్కరించాలి. గతంలో కార్మికులకు ఉన్న సంక్షేమం అమలు చేయాలి.

– నారపల్లి రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	28
వంకాయలు (కాంతులు)	24	బీళ్ల చిక్కుడు	32
వంకాయలు (తెలుపు)	16	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	32	బీట్‌రూట్	32
బీరకాయలు (పందిరి)	50	కీరా దోస	40
కాలీఫ్లవర్	00	ఫ్రెంచ్‌బీన్స్	60-72
క్యాబేజీ	16	అల్లం	50
క్యారెట్	32	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	28	పాలకూర	10
బంగాళదుంపలు	28	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	07-10
దోసకాయలు	24-34	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్	22.30	08
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	13
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - తిరుపతి	16.00	4830	3

అబ్బయ్య చౌదరిని కలసిన నాయకులు

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని శుక్రవారం కొవ్వలి వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. తాము కొఠారు కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటామని తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటి సుధాకర్, కొవ్వలి కోపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు, గొల్ల వీరస్వామి, పోలయ్య, నాయకులు, కార్యకర్తలు అబ్బయ్యచౌదరిని కలిసిన వారిలో ఉన్నారు.

అన్యమత ప్రచారంపై విచారణ

జంగారెడ్డిగూడెం: పాఠశాలలో అన్యమత ప్రచారంపై అధికారులు విచారణ చేశారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం రెడ్డిపేట ఎంపీపీ స్కూల్‌లో శుక్రవారం ఎంఈఓలు బి.రాముడు, జి.రాములు, లక్కవరం ఎస్సై శశాంకలు విచారణ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంఈఓలు తెలిపారు. తొలుత హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తల్లిదండ్రులతో పాటు హిందూ సంఘాలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్కవరం రెడ్డిపేట ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.సుబ్రహ్మణ్యం గత కొంతకాలంగా మతపరంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. దీనిపై తల్లిదండ్రులు గతంలో మందలించగా, పెద్దల సమక్షంలో హెచ్‌ఎం క్షమాపణ చెప్పడంతో అధికారులకు ఫిర్యాదు చేయలేదని గుర్తుచేశారు. ఐనా హిందూ దేవతలపై అవమానకరంగా మాట్లాడుతూ, దీక్షాధారణ చేసిన విద్యార్థుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. పాఠశాల రిజిస్టర్లపై క్రైస్తవ మత వాఖ్యాలు రాయడం, క్రీస్తు గురించి మాట్లాడుతూ, కుల పరంగా వ్యాఖ్యానిస్తూ మనస్థాపానికి గురిచేస్తున్నారని వివరించారు.

చెక్ పోస్ట్ వద్ద వెటర్నరీ సిబ్బంది

కుక్కునూరు: బర్డ్ ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వెటర్నరీ సిబ్బంది అలెర్ట్ అయ్యారు. కుక్కునూరు మండలంలోని అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద వెటర్నరీ సిబ్బందిని నియమించారు. ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల వాహనాలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. శుక్రవారం కుక్కునూరు వెటర్నరీ ఇన్‌చార్జ్ డాక్టర్ బీఆర్ శ్రీనివాసన్ చెక్‌పోస్టును విజిట్ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కోళ్ల మృతికి బర్డ్ ఫ్లూ కాదు

కుక్కునూరు గ్రామంలో రెండు రోజులుగా నాటు కోళ్ల మృతికి కొక్కెర వ్యాధేనని ఇన్‌చార్జ్ డాక్టర్ బీఆర్ శ్రీనివాసన్ తెలిపారు. సీజన్ మారేటప్పుడు కోళ్లకు సాధారణంగా ఇటువంటి వ్యాధి సోకుతుందని చెప్పారు. ఈ వైరస్‌కు వెటర్నరీ సిబ్బందిని కలిసి వ్యాక్సినేషన్ చేయించుకోవాలన్నారు.

హెపటైటిస్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



భీమడోలు సీహెచ్‌సీలో పలు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది, పక్కనే ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.సునీత

భీమడోలు: హెపటైటిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంటెంట్ ఎస్.సునీత అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఏఆర్‌టీ కేంద్రం వద్ద శుక్రవారం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా హెపటైటిస్ బీ,సీ పరీక్షలు చేసి, వ్యాక్సిన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ ఎస్.సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెపటైటిస్ బీ వైరస్ వల్ల సంక్రమిస్తుందని, దీని వల్ల కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వారానికి ఒక రోజు ఆసుపత్రి వద్ద ఉచిత పరీక్షలు, వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. హైపటైటిస్ బీ, సీ వ్యాధుల వల్ల కలిగే అనారోగ్య సమస్యలను నివారణకు ఈ వ్యాక్సిన్ దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ ఏ.హరినాథ్‌కుమార్, హెడ్ నర్స్ ఎస్.శైలజ, కౌన్సలర్ సీహెచ్ సింహాద్రి, ల్యాబ్ టెక్నీషియన్ పాపారావు, ప్రాజెక్టు మేనేజర్ శిరీష, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.